క్లుప్తంగా

వైఎస్ ఎంపీపీ కుటుంబానికి ముద్రగడ పరామర్శ



శ్రీనును పరామర్శిస్తున్న ముద్రగడ పద్మనాభం

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని రాచపల్లిలో వైస్ ఎంపీపీ ఏనుగు శ్రీను (బంకు శ్రీను) కుటుంబాన్ని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ నేత ముద్రగడ పద్మనాభం శనివారం పరామర్శించారు. బంకు శ్రీను తండ్రి వీరరాఘవరావు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. శ్రీను కుటుంబాన్ని పరామర్శించి మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. వీరరాఘవరావు చిత్రపటానికి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు రామిశెట్టి బులిరామకృష్ణ, పార్టీ నాయకులు గొల్లపల్లి దొరబాబు, పెదిరెడ్డి నానిబాబు, నారిపిరెడ్డి వీరబాబు, మడికి ప్రసన్న, గౌతు స్వామి, మర్రి చంద్రరావు, ఒమ్మి రమణ, బొద్దు చిన్న, జక్కా త్రిమూర్తులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినులకు ఉచిత కంటి పరీక్షలు



విద్యార్థినులకు కంటి పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

తుని రూరల్: వి.కొత్తూరు కోళ్లఫారం కాలనీలోని గిరిజన ఆశ్రమ బాలికల పాఠశాలలో విద్యార్థినులకు ఉచిత కంటి పరీక్షలు నిర్వహించారు. శనివారం ప్రధానోపాధ్యాయురాలు విజయకుమారి, వార్డెన్ సుభలక్ష్మి ఆధ్వర్యంలో తునికి చెందిన కిరణ్ కంటి ఆస్పత్రి వైద్యులు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. 200 మంది విద్యార్థినులకు కంటి పరీక్షలు నిర్వహించారు. ఆస్పత్రి మేనేజరు నాగేశ్వరరావు, ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.


పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యకర సమాజం



పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తున్న రవికుమార్

ఏలేశ్వరం: పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యవంతమైన జీవితం గడపొచ్చని జిల్లా మలేరియా అధికారి డాక్టర్ పి రవికుమార్ అన్నారు. మండల పరిధిలోని మార్కండేయపురంలో పీహెచ్‌సీ వైద్యురాలు శ్రీలక్ష్మి ఆధ్వర్యంలో శనివారం జ్వరాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న రవికుమార్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించడం ద్వారా అంటు రోగాలు దరిచేరవన్నారు. నీరు నిల్వ ఉండే ప్రదేశాలను ఎప్పటి కప్పుడు శుభ్రం చేయాలన్నారు. అనంతరం దోమల నిర్మూలన మందును పిచికారీ చేయించారు. గ్రామస్తులకు జ్వరాలు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది ఆనంద్, దైవకృప, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.


రూ.10 లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణం



కేపీ మల్లవరంలో సీసీరోడ్డుకు శంకుస్థాపన

కోటనందూరు: పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా కేఏ మల్లవరంలో రూ.10 లక్షలతో నిర్మించే సీసీ రోడ్లకు ఎంపీడీఓ వెంకట నారాయణ, టీడీపీ నాయకులు గాడి రాజబాబు, భాస్కర సత్యన్నారాయణతో కలిసి శనివారం శంకుస్థాపన చేశారు. పల్లెల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నామని ఎంపీడీఓ అన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ రాజగోపాల్, పంచాయతీ కార్యదర్శి జోగయ్య తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన అవసరం



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై

గోకవరం: ప్రస్తుత సమాజంలో సైబర్ నేరాలు పెరిగి పోయాయని, విద్యార్థులు వీటిపై అవగాహన కలిగి ఉండటం ద్వారా వీటిని నిరోధించవచ్చని ఎస్సై పవన్‌కుమార్ విద్యార్థులకు సూచించారు. గోకవరంలో స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో విద్యార్థులకు శనివారం సైబర్ నేరాలు, ఈవ్ టీజింగ్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆన్‌లైన్ మోసాలు పెరిగిపోతున్నందున సెల్‌ఫోన్ వినియోగించే సమయంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. విద్యార్థులు ఈవ్ టీజింగ్‌కు దూరంగా ఉండాలని సూచించారు.

వరి పంటకు మూషికాల బెడద

- అన్నదాతకు అపార నష్టం
- గణనీయంగా పెరిగిపోతున్న ఎలుకల సంతతి
- అవగాహన కల్పిస్తున్న అధికారులు
- సామూహిక నిర్మూలనా చర్యలతో సత్ఫలితాలు



పొలాల మధ్య రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు



వరిపొలంలో ఎలుక సంచారం

జగ్గంపేట: వరిసాగు చేసే రైతులకు పంట చేతికి వచ్చే వరకూ అనేక సమస్యలు. అధిక వర్షాలు, తెగుళ్లు, గిట్టుబాటు ధర లభించకపోవడం వంటి సమస్యలకు తోడు ఎలుకల సమస్య అన్నదాతలకు తలనొప్పిగా మారింది. రైతులంతా సామూహిక ఎలుకల నివారణ చేపట్టాలని అధికారులు ప్రతి ఏటా అధికారులు అవగాహన కల్పిస్తారు. నిజానికి చిన్న జీవి అయినా, ఎలుకలు వరి పంటకు చేసే నష్టం భారీగానే వుంటుంది. రైతులు సమిష్టిగా కృషి చేస్తేనే సత్ఫలితాలు ఉంటాయని వ్యవసాయ శాస్త్రవేత్తలు పదే పదే చెబుతుంటారు. జగ్గంపేట నియోజకవర్గంలోని నాలుగు మండలాల పరిధిలో సుమారుగా 44 వేల ఎకరాలలో వరిసాగవుతోంది.రైతులు ఎలుకల నివారణపై ప్రత్యేక దృష్టి సారించని పక్షంలో అపార నష్టం వాటిల్లే అవకాశాలు ఉన్నాయి. ఎలుకలు వరికి చేసే నష్టంపై రైతులు అవగాహన పెంచుకోవలసి ఉంది.

తినేది 10 కేజీలు.. పాడుచేసేది 100 కేజీలు..

ఒక ఎలుక ఏడాదికి 10 కేజీల ధాన్యం తింటుందని వ్యవసాయ శాస్త్రవేత్తలు చెబుతున్నారు. అంతే కాదు ఏడాదికి ఒక ఎలుక 100 కేజీల ధాన్యాన్ని పాడుచేస్తుందని అంచనా. అంటే ధాన్యాగారంగా పిలిచే ఉభయ గోదావరి జిల్లాలో ఏటా ఎలుకలు పాడు చేసే వరి నష్టం 10 నుంచి 45 శాతం, పశ్చిమ గోదావరిలో 15 నుంచి 75 శాతం ఉంటుందని అధికారులు లెక్కలు చెబుతున్నారు.

మనుషుల కన్నా ఎలుకల సంతతి 5 రెట్లు అధికం..

మన దేశ జనాభా కన్నా ఎలుకల సంతతి 5 రెట్లు అధికమంటే ఆశ్చర్యం కలగక మానదు. ఎలుకలు 3 నెలల వయసు నుంచి పిల్లలను కంటూ 12 నుంచి 18 నెలల వరకూ జీవిస్తాయి. ఎలుకల సంతతి ఏటా విపరీతంగా పెరుగుతూ వస్తోంది.

వరి పంటకు ఎలుక చేసే నష్టం ఇలా..

ఎలుకల పళ్లు రోజుకు 0.4 మి.మీ చొప్పున పెరుగుతూ పోతూ దాన్ని కపాలాన్ని చీల్చేస్తాయి. ఈ కారణంగా ఎలుకలు ప్రాణాలు కాపాడుకొనేందుకు తమ పళ్లకు గట్టిగా పని చెబుతాయి. వరి దుబ్బులను ఏటవాలుగా 45 డిగ్రీల కోణంలో కొరికి పాడుచేస్తాయి. కాండాన్ని, మొవ్వును తింటాయి. వరి కంకులను కత్తిరించి ఈడ్చుకొని పోయి బొరియలలో ధాన్యాగారాలు ఏర్పాటు చేసుకుంటాయి."పాలు పోసుకుంటున్న కంకులు, కొంచెం గట్టి పడుతున్న కంకులు ఎలుకలకు చాలా ఇష్టం. పంట కోసి పనల మీద ఉన్నప్పుడు, కల్లంలో ధాన్యం ఉన్నపుడు, గిడ్డంగులలో ఎలుకలు రాత్రి పూట తిరుగుతూ నష్టం కలిగిస్తాయి.



ఎలుకల నివారణకు మందు తయారు చేస్తున్న వ్యవసాయ సిబ్బంది

ఎలుకల నివారణకు ఈ పద్ధతులు మేలు

వేసవి దమ్ములో గట్లుచెక్కి వాటి పరిమాణాన్ని తగ్గించడం, కలుపు మొక్కలు తీసేయడం, ప్రతి 8 అడుగులకు 12 అంగుళాల బాటలు తీయడం, పొలాల్లో ఎలుక బోనులు, బుట్టలు పైరు తొలి దశలోనే ఏర్పాటు చేయడం, ఎలుక బొరియలలో ఊదర యంత్రంతో పొగ పెట్టడం చేసి ఎలుకలను చంపాలి. ఎలుకలకు సహజ శత్రువైన గుడ్లగూబలను సంరక్షించడం, గుడ్ల గూబలను పొలం మధ్య వాలేందుకు వీలుగా పంగల కర్రలు ఏర్పాటు చేయాలి. అలాగే రసాయనక పద్ధతులలో భాగంగా బ్రోమోడయోలోన్ మందు వినియోగించడం శ్రేయస్కరం.

సామూహిక ఎలుకల నివారణతో సాధ్యం



సామూహిక ఎలుకల నివారణకు రైతులంతా కలిసి రావాలి. ఎలుకలను నివారించేందుకు అనేక పద్ధతులు ఉన్నాయి. వీటిని సిబ్బంది రైతులకు వివరిస్తున్నారు. రసానక పద్ధతుల ద్వారా ఎలుకలను ఏవిధంగా నివారించాలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ప్రయోగాత్మకంగా చేసి చూపిస్తున్నాం. విషపు ఎరలను రైతుల సమక్షంలోనే తయారు చేసి అందజేస్తున్నాం. రైతులు సమిష్టిగా ప్రత్యేక శ్రద్ధ కనబరిస్తే వరిలో పలుకల వల్ల జరిగే పంట నష్టాన్ని బాగా తగ్గించుకోవచ్చు.

– రెడ్ల శ్రీరామ్, మండల వ్యవసాయ అధికారి, జగ్గంపేట.

ఎలుకల సంతతి బాగా పెరిగిపోయింది..



మెట్ట ప్రాంతమైన మా గ్రామంలో ఎలుకల సంతతి బాగా పెరిగిపోయింది. పరిసర గ్రామాలలోనూ ఇదే విధంగా ఉంది. దీని వల్ల రైతులు నష్ట పోతున్నారు. రైతులంతా కలిసి ఎలుకల నివారణకు అధికారుల సూచనల మేరకు సంఘటితంగా ప్రయత్నిస్తున్నాం. దీని వల్ల మంచి ఫలితాలు కనిపిస్తున్నాయి. ఎలుకల నివారణకు ప్రతి రైతు ముందుకు వచ్చి సహకరిస్తే మరింత ప్రయోజనం వుంటుంది.

–పెంటకోట సత్యనారాయణ, మామిడాడ, జగ్గంపేట మండలం.

ధాన్యం కొనుగోలుపై శిక్షణ

కోటనందూరు: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ధాన్యం కొనుగోలుపై టెక్నికల్ అసిస్టెంట్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు, వీఏఏ, వీఆర్వోలకు శనివారం శిక్షణ ఇచ్చారు. పౌర సరఫరాల శాఖ టెక్నికల్ అసిస్టెంట్ సత్యరాజ్ ధాన్యం తేమ పరీక్షల నిర్ధారణ, వెహికల్ రిజిస్ట్రేషన్, గోనె సంచుల సరఫరా తదితర విషయాలపై అవగాహన కల్పించారు. ధాన్యం సరఫరా చేసే మిల్లును రైతే ఎంచుకునే వెసులుబాటు ఉందన్నారు. ధాన్యం కొనుగోలులో విధిగా ప్రభుత్వ నిబంధనలు పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఓ చంద్రశేఖర్, డిప్యూటీ తహసీల్దార్ సత్యన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.

శంఖవరం: ఖరీఫ్ సీజన్‌లో రైతులు పండించిన ధాన్యం కొనుగోలుపై వీఆర్వోలు, టెక్నికల్ అసిస్టెంట్‌లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లకు అవగాహన కల్పించడం జరిగిందని ఏఓ పి.గాంధీ తెలిపారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో జిల్లా పౌర సరఫరా టెక్నికల్ అసిస్టెంట్‌లు కిశోర్, సురేష్‌ల ఆధ్వర్యంలో శిక్షణ కొనసాగింది. ధాన్యం కొనుగోలులో తీసుకోవల్సిన జాగ్రత్తలు వివరించారు. శంఖవరం, కొంతంగి, కత్తిపూడి, అన్నవరం రైతు సేవా కేంద్రాలలో ధాన్యం కొనుగోలు చేయడం జరుగుతుందన్నారు.

ఘనంగా అన్న సమారాధన

రౌతులపూడి: దేవీ నవరాత్ర మహోత్సవాల ముగింపును పురస్కరించుకొని మండలంలోని ఎస్.పైడిపాల దుర్గాదేవి ఆలయం వద్ద శనివారం అన్న సమారాధన నిర్వహించారు. గ్రామపెద్దలు, యువకుల సహకారంతో ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో సుమారు రెండు వేల మందికి పైగా భక్తులు పాల్గొని అన్న ప్రసాదాలను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు గొల్లు చినదివాణం, వైఎస్సార్ సీపీ నాయకులు గొల్లు వెంకట రమణమూర్తి, రాయి చిన్నబ్బాయి, జిగిరెడ్డి సత్తిబాబు, గొల్లు వెంకట రమణ, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మురళీరాజును కలిసిన వైఎస్సార్ సీపీ శ్రేణులు



వైఎస్సార్ సీపీ నేత మురళీరాజును కలిసిన పార్టీ నాయకులు

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని ధర్మవరంలో వైఎస్సార్ సీపీ నేత ముదునూరి మురళీ కృష్ణంరాజును శనివారం వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు మర్యాద పూర్వకంగా కలిశారు. ఇటీవల వైఎస్సార్ సీపీలో చేరిన మురళీరాజును నియోజకవర్గంలోని పలు గ్రామాలకు చెందిన పార్టీ నేతలు కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. మురళీరాజు మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే వరుపుల సుబ్బారావుతో కలిసి రానున్న సార్వత్రి ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయమే లక్ష్యంగా పని చేస్తానన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ గౌనగాల అప్పలరాజు, ఎంపీటీసీ సభ్యుడు ముప్పిటి ఏసుబాబు, పార్టీ నాయకులు శెట్టి సత్తిబాబు, అల్లి సత్తిబాబు, పంచాది చంటి, రేఖ కృష్ణార్జున్, చక్కపల్లి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధే లక్ష్యం

- ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ



జగపతినగరంలో అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ

కిర్లంపూడి: గ్రామాల అభివృద్ధే ప్రధాన లక్ష్యమని జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ తెలిపారు. పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా కిర్లంపూడి మండలంలో సుమారు రూ.2.90 కోట్ల నిధులతో నిర్మించే డ్రైనేజీలు, సీసీ రోడ్ల నిర్మాణాలకు జనసేన జగ్గంపేట ఇన్‌చార్జి తుమ్మలపల్లి రమేష్‌తో కలిసి శనివారం భూమి పూజ చేశారు. నూతనంగా నిర్మించిన పశు వైద్యశాలను వారు ప్రారంభించారు. చిల్లంగిలో 2 పనులకు గానూ రూ.50 లక్షలు, జగపతినగరంలో 4 పనులకు గానూ రూ.1 కోటి, కిర్లంపూడిలో 4 పనులకు గానూ రూ. 1 కోటి, భూపాలపట్నంలో 1 పనికి గానూ రూ. 20 లక్షలు, గోనేడలో 1 పనికి గానూ రూ. 20 లక్షలు కేటాయించడం జరిగిందని పంచాయతీరాజ్ డీఈ ఉమాశంకర్ తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ హరికృష్ణ, ఎంపీపీ తోట రవి, జెడ్పీటీసీ సభ్యుడు తోట గాంధీ, మండల పార్టీ అధ్యక్షుడు చదరం చంటిబాబు, సర్పంచ్ మహేంద్రాడ శ్రీలత, తూము కుమార్, కుర్ల చిన బాబు, కాళ్ల వెంకటేష్, యడాలి రాంబాబు, వీరంరెడ్డి కాశీబాబు, గుడాల రాంబాబు, ఎంపీడీఓ బి.హరికృష్ణ, డీఈ వై.ఉమాశంకర్, పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

గ్రామ సభలతో రీ సర్వే సమస్యల పరిష్కారం



తామరాడలో భూ సమస్యలను తహసీల్దార్‌కు వివరిస్తున్న రైతులు

తుని రూరల్: రీ సర్వేలో నెలకొన్న భూ సమస్యలు పరిష్కరించేందుకు నిర్వహిస్తున్న గ్రామ సభలను యజమానులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ ప్రసాద్ అన్నారు. శనివారం ఎస్.అన్నవరం శివారు కవలపాడు రెవెన్యూ పరిధిలో జరిపిన రీ సర్వే సమస్యలు, పరిష్కారాలపై రెవెన్యూ అధికారులు సచివాలయంలో గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ రీ సర్వేలో సమస్యలు వస్తే పరిష్కరించేందుకు గ్రామ సభ నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ కవలపాడులో పదుల సంఖ్యలో ఉన్న ఇటుక బట్టీలను మూసి వేయాలని, ఇటుక బట్టీల వల్ల భూముల్లో బూడిద ఏర్పడి ఇబ్బందిగా మారిందన్నారు. రైతులు, అటుగా వెళ్లే వివిధ గ్రామాల ప్రజల ఇబ్బందులను గుర్తించి సమస్య పరిష్కరించాలని కోరారు. వైస్ ఎంపీపీ చోడిశెట్టి సత్యనాగేశ్వరరావు, నాయకులు కుసనం దొరబాబు, పోలిశెట్టి రామలింగేశ్వరరావు, వంగలపూడి జమీలు, మండల సర్వేయర్ దేవుడు, వీఆర్వో కృష్ణ పాల్గొన్నారు.



ఆనూరులో రీసర్వే గ్రామసభ

రీ సర్వే భూ సమస్యల పరిష్కారం

శంఖవరం: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన రీసర్వే భూ సమస్యలు గ్రామ సభల ద్వారా పరిష్కారమవుతాయని తహసీల్దార్ పోతురాజు అన్నారు. శనివారం మండలంలోని గౌరంపేట గ్రామంలో నిర్వహించిన రీ సర్వే గ్రామ సభలో ఆయన పాల్గొన్నారు. రైతుల నుంచి పలు వినతి పత్రాలు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెవెన్యూ రికార్డుల్లోని సర్వే నంబర్లలో తప్పొప్పులను రీ సర్వే ద్వారా పరిష్కరించడం జరుగుతుందన్నారు. ఆన్‌లైన్‌లో లేని రైతుల భూములను ఆన్‌లైన్ చేయడం జరుగుతుందన్నారు. దరఖాస్తు చేసుకున్న 18 రోజుల్లో భూ సమస్యలు పరిష్కరించడం జరుగుతుందన్నారు.

భూ సమస్యల పరిష్కారమే లక్ష్యం

కిర్లంపూడి: రీ సర్వే పూర్తయిన గ్రామాల్లో భూ సమస్యల పరిష్కారమే రెవెన్యూ గ్రామ సభల లక్ష్యమని తహసీల్దార్ జె.చిరంజీవి అన్నారు. తామరాడ గ్రామ సచివాలయంలో స్థానిక సర్పంచ్ తోట అయ్యన్న అధ్యక్షతన శనివారం రెవెన్యూ గ్రామ సభ నిర్వహించారు. భూ సమస్యలపై ప్రజల నుంచి వచ్చిన అర్జీలను ఆయన స్వీకరించారు. ఈ సందర్భంగా చిరంజీవి మాట్లాడుతూ రీ సర్వే సమస్యలపై 12 అర్జీలు వచ్చినట్లు చెప్పారు. ఎంపీటీసీ సభ్యుడు గోకేడ రాజు, రీసర్వే డిప్యూటీ తహసీల్దార్ ఆర్.శ్రావణ, డీఎల్ఎస్ఓ పీవీకేఎస్ ప్రసాద్, ఆర్ఐ సత్యదేవి, వీఆర్వో మురళి, రైతులు ఉన్నారు.



గౌరంపేటలో గ్రామసభ నిర్వహిస్తున్న అధికారులు

రీసర్వే గ్రామసభలో 21 దరఖాస్తులు

తొండంగి: భూముల రీసర్వేకు సంబంధించి అభ్యంతరాల స్వీకరణకు మండలంలోని ఆనూరు గ్రామంలో శనివారం నిర్వహించిన గ్రామ సభలో 21 దరఖాస్తులు వొచ్చాయని తహసీల్దార్ వి.మురార్జీ తెలిపారు. రీసర్వేలో సరి హద్దులు, సర్వే నెంబర్లు, విస్తీర్ణంలో మార్పులకు సంబంధించిన దరఖాస్తులు అందినట్లు చెప్పారు. దరఖాస్తులను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ రాజారావు, వీఆర్వోలు, స్థానిక ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న వీధి నాటకం



'గోవిందా గోవిందా' అనే వీధి నాటకాన్ని ప్రదర్శిస్తున్న కళాకారులు

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని ధర్మవరంలో శ్రీ గౌరీ శంకరుల ఉత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ ఉత్సవాల్లో భాగంగా శనివారం స్థానిక కళాకారులు 'గోవిందా గోవిందా' వీధి నాటకాన్ని ప్రదర్శించారు. గ్రామంలోని నందిసెంటర్, సీతంపేట, రామారావుపేట, మంగయ్యమ్మపేట, సినిమా హాలు సెంటర్లలో ఈ నాటకాన్ని ప్రదర్శించగా స్థానికులు ఆసక్తిగా తిలకించారు. నాటకంలో గోవిందుడుగా బలిజి వీర్రాజు, పెద్ద కుమారుడుగా బర్ల రాజబాబు, చిన్న కుమారుడుగా మడబాల బాబ్జి నటించారు. సీనియర్ కళాకారులు రాయి సుబ్బారావు మేకప్-డ్రెస్సింగ్ చేశారు. ముందుగా గౌరమ్మకు ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించి నాటక ప్రదర్శనను ప్రారంభించారు.

భక్తి శ్రద్ధలతో అట్లతద్దె



పోలవరం కాలువ వద్ద గంగమ్మకు పూజలు చేసేందుకు వెళుతున్న మహిళలు

ప్రత్తిపాడు రూరల్: మండల వ్యాప్తంగా అట్లతద్దె వేడుకను శనివారం మహిళలు అత్యంత భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. పెళ్లి కాని ఆడపిల్లలు, పెళ్లయిన స్త్రీలు ఉదయం నుంచి చంద్రోదయం అయ్యే వరకు ఉపవాసం ఉండి గౌరీ దేవిని భక్తి శ్రద్ధలతో కొలిచారు. వ్రత నియమాలు పాటిస్తూ అమ్మవారిని కొలిచారు. అనంతరం గౌరీదేవికి వాయినాలు సమర్పించుకొన్నారు. మండలంలోని సుబ్బారెడ్డి సాగర్ ఏటి కాలువ, పోలవరం కాలువలలో గంగమ్మకు పూజలు చేసి చుక్కను తిలకించారు.

రహదారుల నిర్మాణంపై ప్రత్యేక దృష్టి



జె.అన్నవరంలో సీసీ రోడ్డుకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే సత్యప్రభ

ఏలేశ్వరం: గ్రామాల్లోని రహదారుల నిర్మాణాలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తుందని ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ అన్నారు. మండలంలోని మర్రివీడు, జె అన్నవరం, తూర్పు లక్ష్మీపురం గ్రామాల్లో శనివారం పల్లెపండుగ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే ఆయా గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. గ్రామాల అభివృద్ధిలో భాగంగా తొలుత సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జ్ వరుపుల తమ్మయ్యబాబు, ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి, మూది నారాయణస్వామి, వత్సవాయి సూర్యనారాయణరాజు, బోదిరెడ్డి గోపి, జ్యోతుల పెదబాబు తదితరులు పాల్గొన్నారు.

రెండు గ్రామాల్లో పల్లె పండుగ

ప్రత్తిపాడు: గ్రామీణ ప్రాంతాల సమస్యలను పరిష్కరించడమే లక్ష్యంగా పల్లె పండుగ నిర్వహిస్తున్నామని ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ తెలిపారు. మండలంలోని టి రాయవరం, ప్రత్తిపాడు గ్రామాల్లో శనివారం సాయంత్రం నిర్వహించిన పల్లె పండుగ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. మండలంలోని వివిధ గ్రామాల్లో రోడ్లు నిర్మిస్తున్నట్టు చెప్పారు. ప్రత్తిపాడులో రూ. 53 లక్షలు, టి.రాయవరంలో రూ.18 లక్షలతో నిర్మించనున్న రోడ్లకు ఆమె భూమి పూజ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఎంవీఆర్ కుమార్ బాబు, సర్పంచ్‌లు గుడాల విజయలక్ష్మి, తటవర్తి సుబ్బారావు, ఈఓపీర్డీ కేవీవీఎస్ కాశీ విశ్వనాథం, గుడాల వెంకటరత్నం, కొమ్ములు కన్నబాబు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

గౌరీ పరమేశ్వరుల నిలుపుదల మహోత్సవం



కిర్లంపూడిలో గౌరీ పరమేశ్వరుల ఊరేగింపు

కిర్లంపూడి: కిర్లంపూడి కుమ్మరివీధిలో శనివారం గౌరీ పరమేశ్వరుల నిలుపుదల మహోత్సవాన్ని భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. జగపతినగరంలో విశ్వబ్రాహ్మణులు తయారు చేసిన గౌరీ పరమేశ్వరుల విగ్రహాన్ని మేళ తాళాల మధ్య గ్రామ వీధుల్లో ఊరేగించారు. అనంతరం కుమ్మరివీధి రామాలయం వద్ద అమ్మవారిని నిలుపుదల చేశారు. అధిక సంఖ్యలో భక్తులు గౌరీ పరమేశ్వరులను దర్శించుకుని పూజలు చేశారు. పలువురు మహిళలు ఉదయం నుంచి ఉపవాసం ఉండి వరి దుబ్బుకు ప్రత్యేక పూజలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వెంకన్న ఆలయానికి పోటెత్తిన భక్తులు

గోకవరం: మండలంలోని తంటికొండ వెంకటేశ్వర స్వామి ఆలయానికి శనివారం భక్తులు పోటెత్తారు. ఆలయ అర్చకులు తెల్లవారు జాము నుంచి స్వామి వారికి మేలుకొలుపు సేవ, అభిషేకాలు, పుష్పార్చన నిర్వహించారు. మధ్యాహ్నం పంచహారతులు సమర్పించి పల్లకీసేవ జరిపారు. మండలం నుంచే కాక చుట్టు పక్కల మండలాల నుంచి విశేష సంఖ్యలో భక్తులు స్వామిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. మధ్యాహ్నం దేవస్థానం ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. సుమారు రెండు వేల మంది భక్తులు స్వామి వారిని దర్శించుకొని అన్న ప్రసాదం స్వీకరించినట్టు ఈఓ వడ్డాది సత్యన్నారాయణ తెలిపారు.

నేడు దేవీచౌక్ వద్ద అన్నదానం

గోకవరం: గోకవరంలో ప్రసిద్ధి గాంచిన దేవీచౌక్ ఆలయం వద్ద ఆదివారం భారీ అన్నదానం జరుగుతుందని ఆలయ ప్రధాన అర్చకుడు డాక్టర్ వల్లూరి జగన్నాథ శర్మ, ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. శరన్నవరాత్ర ఉత్సవాల్లో భాగంగా అన్నదాన కార్యక్రమం జరుగుతుందని ఈ అన్నదానానికి విశ్వహిందూ ధర్మ పరిరక్షణ రామసేన అధ్యక్షుడు కంబాల శ్రీనివాస్‌రావు రూ.4 లక్షలు అందజేశారన్నారు. ఉత్సవాలకు సైతం ఆయన రూ.4 లక్షలు ఆర్థిక సహకారం అందించారన్నారు. గ్రామస్తులంతా ఈ అన్నదాన కార్యక్రమంలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

23 నుంచి అయ్యప్ప మాలధారులకు అన్నదానం

గోకవరంలో అయ్యప్ప మాలధారులకు ఈ నెల 23 నుంచి ఉచితంగా అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేసినట్టు విశ్వహిందూ ధర్మ పరిరక్షణ రామసేన అధ్యక్షుడు కంబాల శ్రీనివాస్‌రావు తెలిపారు. అయ్యప్ప దీక్ష తీసుకున్న వారికి 41 రోజుల పాటు మధ్యాహ్నం భిక్ష సదుపాయాన్ని ఏర్పాటు చేశామన్నారు. స్థానిక సత్యకృష్ణ కల్యాణ మండపంలో ప్రతి రోజు మధ్యాహ్నం నిర్వహించే ఈ కార్యక్రమాన్ని అయ్యప్ప మాలధారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.